సాక్షి రంగారెడ్డి
సోమవారం । 31 । మార్చి । 2025



ఎండుతున్న పంటలు

సాగు నీరందక గతేడాది మాదిరిగానే పంటలు ఎండిపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. 8లో▸



లారీ, బస్సు ఢీ

ముందు వెళ్తున్న లారీని ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తోపాటు ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. 8లో▸



హోటల్ దగ్ధం

ప్రమాదవశాత్తు ఓ హోటల్ దగ్ధమైంది. ఈ సంఘటన ఆమనగల్లు పట్టణ సమీపంలోని విఠాయిపల్లి వద్ద చోటుచేసుకుంది. 8లో▸

సన్న రైస్.. వచ్చేశాయ్

- స్టాక్ పాయింట్ల నుంచి తరలింపు
- రేషన్ దుకాణాలకు చేరిన బియ్యం
- రేపటి నుంచి పంపిణీ షురూ



గోదాం నుంచి రేషన్ షాపులకు తరలిస్తున్న సన్న బియ్యం

ఇబ్రహీంపట్నం: సన్నబియ్యం వచ్చేశాయి.. స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు చేరుకున్నాయి. ఈ మేరకు మంగళవారం నుంచి పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన కానుకగా రేషన్ కార్డుదారులకు (ఆహార భద్రత కార్డులు) సన్నబియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా పథకాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి (మంగళవారం) అన్ని గ్రామాల్లో రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం ఈనెల 25 నుంచి రేషన్ దుకాణాలకు స్టాక్ పాయింట్ల (గోదాం) నుంచి తరలిస్తున్నారు. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఆయా రేషన్ షాపుల్లోకి సన్న బియ్యం చేరుకున్నాయి.

ఒక్కొక్కరి ఆరు కిలోల చొప్పున..

ఇబ్రహీంపట్నం మండలంలో 18,941 ఆహారభద్రత కార్డులకు 37 రేషన్ షాపులు, యాచారం మండలంలో 13,733 ఆహార భద్రత కార్డులకు 26 రేషన్‌షాపులు, మంచాల మండలంలో 12,122 ఆహార భద్రత కార్డులకు 26 రేషన్ షాపులున్నాయి. ఈ మూడు మండలాల్లో 89 షాపులకుగాను 900 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతి నెల ఇబ్రహీంపట్నంలోని స్టాక్ పాయింట్ నుంచి తరలిస్తారు. రేషన్ దుకాణాల్లో యూనిట్‌కు (కార్డుల్లో ఉన్న ఒక్కొక్కరిని ఒక యూనిట్‌గా) ఆరు కిలోల చొప్పున కార్డుదారులకు పంపిణీ చేస్తారు. కొత్త రేషన్ కార్డుదారులకు కూడా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రజాపాలన, మీ సేవ కేంద్రాల ద్వారా చేసుకున్న దరఖాస్తుల్లో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం ఇవ్వడం ద్వారా బ్లాక్ మార్కెటింగ్ అవకాశాలు తక్కువగా ఉంటాయని భావిస్తున్నారు.



ఇబ్రహీంపట్నంలోని ఓ రేషన్ దుకాణానికి చేరుకున్న సన్న బియ్యం

సంతోషంగా ఉంది



మెకానిక్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. సన్నబియ్యంతో భోజనం చేసేందుకు నోచుకుంటామో లేదో అనుకున్నా. ప్రభుత్వం ఆ కలను నిజం చేస్తుండడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– ఎం.నర్సింహ, ఇబ్రహీంపట్నం

రేషన్ షాపులకు తరలించాం



ఈనెల 25 నుంచి స్టాక్ పాయింట్ ద్వారా 25 క్వింటాళ్ల చొప్పున ప్రతి రేషన్ దుకాణానికి సన్నబియ్యం తరలించాం. కొత్త పథకం కాబట్టి ఐదు రోజులు ఆలస్యంగా తరలింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఆదివారంతో అన్ని షాపుల్లోకి తరలింపు పూర్తి చేశాం. మంగళవారం నుంచి కార్డుదారులకు పంపిణీ జరుగుతుంది.

– జ్యోతి, స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జి, ఇబ్రహీంపట్నం

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న గణితం లెక్చరర్ (డిగ్రీ) ఒక పోస్టు, కెమిస్ట్రీ లెక్చరర్ (డిగ్రీ) రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆయా సబ్జెక్టులను బోధించేందుకు అతిథి అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో ఏప్రిల్ 10వ తేదీలోపు నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మైసిగండి ప్రధానార్చకుడికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న యాదగిరి

కడ్తాల్: మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు మాధారం యాదగిరి ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వావసునామ సంవత్సర వేడుకల్లో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్, కమిషనర్ శ్రీధర్ చేతుల మీదుగా యాదగిరి పురస్కారం అందుకున్నారు. యాదగిరికి పురస్కారం రావడంపై మైసిగండి ఆలయ అర్చక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్‌గా ప్రమీల



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీసెల్ మహిళా విభాగం కన్వీనర్‌గా జి.ప్రమీలను నియమిస్తూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా ఎస్సీ సెల్ విభాగం ఇన్‌చార్జి పెంటయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తలకొండపల్లిలో స్వేరోస్ భీందీక్ష ముగింపు సభ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు

తలకొండపల్లి: వచ్చేనెల 13న మండల కేంద్రంలో స్వేరోస్ భీందీక్ష ముగింపు సభ నిర్వహించనున్నట్లు స్వేరోస్ వ్యవస్థాపకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ముగింపు సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ముగింపు సభ నిర్వహించేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆకాశమే హద్దుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులంతా స్వేరోస్ స్ఫూర్తితో విద్యారంగంలో రాణిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారంటే స్వేరోస్ కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర నాయకులు జ్యోతయ్య, వెంకటేశ్, నాగేశం, దుర్గయ్య, చందు, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, నిరంజన్ పాల్గొన్నారు.

'విశ్వావసు'తో అభయం

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: విశ్వావసు నామ సంవత్సరం అభయం ప్రసాదిస్తుందని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. ఉగాది సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. ముందుగా స్వామివారిని ఆలయ మండపంలో ఆసీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో పంచాంగం చదివి వినిపించారు. విశ్వావసు నామ సంవత్సరం ఏ విధమైన భయం లేకుండా అభయం ఇస్తుందన్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా పడకపోయినా అనావృష్టి మాత్రం ఉండదన్నారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉంటాయన్నారు.

బ్రహ్మోత్సవాల పత్రిక ఆవిష్కరణ

చిలుకూరు బాలాజీ దేవాలయం బ్రహ్మోత్సవాల పత్రికను ఆదివారం ఆలయ అర్చకులు ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం స్వామివారి పాదాల వద్ద పత్రికను ఉంచి పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలతో కలిసి పత్రికను ఆవిష్కరించారు. ఏప్రిల్ 7 నుంచి 14 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని అర్చకుడు రంగరాజన్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సంతానం లేని మహిళలకు స్వామివారి గరుడ ప్రసాదం పంపిణీ ఈసారి ఉండదని స్పష్టం చేశారు. సంతాన భాగ్య ప్రసాదాన్ని మే నెల నుంచి ప్రతి శుక్రవారం పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు బాలాజీ, కిట్టు, సురేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు రంగరాజన్

రంజాన్ ప్రార్థనలకు భారీ ఏర్పాట్లు

చార్మినార్: నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నగర వ్యాప్తంగా భారీ ఎత్తున సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, పాతబస్తీలోని మక్కా మసీదులో టెంట్లు వేసి భారీ ఏర్పాట్లు చేశారు. పాత బస్తీ మీరాలం ఈద్గాలో సామూహిక ప్రార్థనల నేపథ్యంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు ఈ రూట్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి. ఈ దారిలో వెళ్లే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించనున్నారు. బహదూర్‌పురా, కాలాపత్తర్, నవాబ్ సాబ్ కుంట, శాస్త్రి పురం, దానమ్మ గుడిసెలు తదితర రూట్లలో వాహనాల దారి మళ్లింపు ఉంటుందని నగర ట్రాఫిక్ డీసీపీ–3 ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు.

చాయ్‌వాలా కుమారుడు.. అగ్నివీరుడు

పూడూర్: చాయ్‌వాలా కుమారుడు అగ్నిపథ్ పథకంలో ఆర్మీ ఉద్యోగానికి అర్హత సాధించాడు. మండల పరిధిలోని చెన్గోముల్ గ్రామానికి చెందిన అబ్దుల్ అజీజ్ టీస్టాల్ నిర్వహిస్తూ వచ్చిన కొద్ది ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పిల్లల విద్యాభివృద్ధికి మొక్కవోని దీక్షతో కష్టపడ్డాడు. ఆయన కష్టానికి ఫలితంగా పెద్ద కుమారుడు అబ్దుల్ జబ్బార్ ఇటీవల విడుదలైన అగ్నిపథ్ పథకంలో అగ్నివీరుడుగా ఎంపికయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తుండగా.. గ్రామస్తులు అభినందినలతో ముంచెత్తుతున్నారు.

ఘనంగా గరుడ వాహన సేవ



కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రోకంగా తిరుమల తరహాలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి సర్వభూపాల వాహనంపై ఊరేగిన శ్రీవారు ఆదివారం ఉదయం మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 10 గంటలకు భూదేవి శ్రీదేవి సమేతంగా గరుడ వాహనంపై ఆసీనులైన శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. జాతర స్థలం వరకు కొనసాగిన ఈ ఊరేగింపు ఆద్యంతం గోవింద నామస్మరణతో కొనసాగింది. అర్ధరాత్రి వేంకటేశ్వరస్వామి జాతర స్థలంలో లంకా దహన కార్యక్రమం వైభవంగా జరిగింది. టపాసులు వెలుతురులు ఆకాశంలో కనువిందు చేశాయి. చెన్నై నుంచి ప్రత్యేకంగా తెప్పించిన టపాసులతో లంకాదహనం నిర్వహించారు.



మీది సాయం.. మాది ప్రోత్సాహం

రోడ్డు ప్రమాదంలో గాయపడి సమయానికి సరైన వైద్యం అందక ఎన్నో ప్రాణాలు పోతున్నాయి.. ఘటన జరిగినప్పుడు కేసులు.. పోలీసులు మా కెందుకీ పంచాయితీ అనుకుని చాలామంది చూస్తూ వెళ్తున్నారే తప్ప సాయం చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.. ఇలాంటి సమయాల్లో క్షతగాత్రులను తక్షణమే ఆస్పత్రుల్లో చేర్చండి.. మీకు మేమున్నాం అంటూ భరోసా కల్పిస్తోంది కేంద్రం.. ప్రోత్సహించడంతోపాటు ప్రోత్సాహకం అందిస్తోంది.

ఆపద్బాంధవులకు కేంద్రం భరోసా

- క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు తరలించండి
- గుడ్ సమరిటన్ పథకంతో గుర్తిస్తాం
- రూ.5వేలు ప్రోత్సాహకం.. ప్రశంసా పత్రం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2021లో గుడ్ సమరిటన్ పథకానికి శ్రీకారం చుట్టింది. జాతీయ స్థాయి అవార్డులకు అవకాశంతో పాటు రూ.5వేల నగదు, ప్రశంసాపత్రం అందిస్తోంది. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తీసుకెళ్తే కేసు, పోలీసుల పంచాయితీ ఉంటుందని గతంలో చాలామంది సాయం చేయాలనుకున్నా వెనుకాడేవారు. ప్రస్తుతం అవగాహన పెరగడంతో పాటు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నారు. 108 వాహనం అందుబాటులో లేకపోతే తమ వాహనంలో, ఇతర వాహనాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్చుతున్నారు. గుడ్ సమరిటన్ పథకం ద్వారా ఇలాంటి వారికి ప్రోత్సాహం లభిస్తోంది.

ఆస్పత్రులకు తరలించి.. ప్రాణాలను నిలబెట్టి

సకాలంలో వైద్యం అందక రోడ్డు ప్రమాద బాధితుల్లో దాదాపు 50 శాతం మృతి చెందుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. కొందరు సాయం చేయకపోగా సంఘటనా స్థలంలో క్షతగాత్రులను వీడియో, ఫొటోలు తీసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సమరిటన్ పథకం అందరినీ సాయం చేసేలా ప్రోత్సహిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు 108 అంబులెన్స్ రావడం సైతం ఇబ్బందికరంగా మారుతోంది. అలాంటి సమయాల్లో చాలామంది ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్తున్నారు. సరైన సమయంలో ఆస్పత్రులకు తరలించడం ద్వారా ప్రాణాలను నిలబెడుతున్నారు.

ప్రశంసలతోపాటు నగదు ప్రోత్సాహకం

ప్రమాదం జరిగిన గంటలోగా ఆస్పత్రికి తీసుకొస్తే ప్రాణాపాయం నుంచి కాపాడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీన్నే గోల్డెన్ అవర్‌గా పేర్కొంటున్నారు. ఇప్పుడు కేంద్రం ప్రకటించిన సమరిటన్ తో గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రిలో చేర్చిన వారికి రూ.5 వేలు అందనున్నాయి. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలంటే పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓలు లెటర్ ప్యాడ్‌పై వివరాలు రాసి ఇవ్వాల్సి ఉంటుంది. పోలీసులు కూడా కేసుతో సంబంధం లేకుండా రాసివ్వాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ జత చేస్తే నేరుగా వారి ఖాతాలో నగదు జమ అవుతుంది. ప్రశంసాపత్రం కూడా అందుతుంది. సంవత్సరానికి గరిష్ఠంగా ఐదు అవార్డులు ఇస్తారు. అత్యంత విలువైన మంచి సహాయకులకు ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు, జాతీయ స్థాయి అవార్డులు సైతం ఇస్తారు. అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేయడానికి ప్రజలను ప్రేరేపించడం.. చట్టపరమైన పరిణామాలకు భయపడకుండా సాయం చేసే సంస్కృతిని పెంపొందించడం ఈ పథకం లక్ష్యం. ఈ పథకంపై సమగ్రంగా ప్రచారం చేసి అవగాహన కల్పిస్తే .. మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ప్రజలను చైతన్యం చేస్తాం



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన గుడ్ సమరిటన్ పథకంపై ప్రజలను చైతన్యం చేస్తాం. అవగాహన సమావేశాలు నిర్వహించేలా స్థానిక పోలీసులకు, వివిధ శాఖల అధికారులకు సూచిస్తాం. గాయపడ్డ వారిని ఆస్పత్రిలో చేర్పిస్తే గుర్తింపు లభిస్తుంది. దాంతో పాటు ఆర్థిక సహకారం అందుతుంది. ప్రభుత్వాలు గుర్తిస్తాయి.

– కేపీవీ రాజు, ఏసీపీ, ఇబ్రహీంపట్నం

నేడు జూ పార్క్ తెరిచే ఉంటుంది

చార్మినార్: సందర్శకుల సౌకర్యార్థం నెహ్రూ జూలాజికల్ పార్క్ ఈ సోమవారం తెరిచే ఉంటుందని సంబంధిత క్యూరేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగ అయినప్పటికీ.. నెహ్రూ జూలాజికల్ పార్క్ తెరిచే ఉంటుందన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకుల సందర్శనార్థం అందుబాటులో ఉంటుందనే విషయాన్ని గమనించాలని కోరారు. సాధారణంగా ప్రతి సోమవారం నెహ్రూ జూలాజికల్ పార్కు సందర్శన ఉండదని.. ఈ సోమవారం ప్రత్యేక పరిస్థితుల కారణంగా పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఆదేశాల మేరకు తెరిచి ఉంటుందని తెలిపారు.

నాలుగు పోస్టులు.. ఒక్కరే అధికారి!

వేధిస్తున్న ఉద్యోగుల కొరత

- పదేళ్లుగా నియామకాలు నిల్
- 40 మంది పని చేయాల్సిన చోట 15 మందే..
- సీఈఐజీ గుప్పిట్లోనే కీలక పోస్టులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి కార్యాలయంలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. పదేళ్లుగా కొత్త నియామకాలు లేకపోవడం.. ఉన్నవాళ్లకు పదోన్నతులు రాకపోవడంతో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ గవర్నమెంట్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ హైదరాబాద్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రూరల్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ నిజామాబాద్ పోస్టుల్లో ఒక్కరే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇప్పటికే ఉన్న 17,130 హెచ్‌టీ కనెక్షన్లకు పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించడంతోపాటు కొత్తగా పుట్టుకొచ్చే చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు, సినిమా థియేటర్లు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, హోటల్స్, ఐటీ, అనుబంధ సంస్థల కార్యాలయాలు, క్రషర్ మిషన్లు, రెడీమిక్స్ ప్లాంట్లు, గృహ, వాణిజ్య బహుళ అంతస్తుల భవన సముదాయాలను తనిఖీ చేసి వాటికి అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది.

- కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండడం, ఒక్కరే ఈ బాధ్యతలన్నీ నిర్వర్తించాల్సి రావడంతో అనుమతుల జారీలో తీవ్ర జాప్యం నెలకొంటోంది.



థర్డ్‌పార్టీ నివేదికలను గుడ్డిగా అనుసరిస్తూ..

- విద్యుత్ పనుల్లో నాణ్యత ప్రమాణాల పెంపు, ప్రమాదాల నియంత్రణ కోసం ప్రభుత్వం విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి విభాగాన్ని ఏర్పాటు చేసింది. 75 కేవీఏ సామర్థ్యం దాటిన ఏదైనా బహుళ అంతస్తుల భవనం సహా పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్లను జారీ చేయాలంటే ముందు ఈ సీఈఐజీ అనుమతి తప్పనిసరి. అధికారులు తమ తనిఖీల్లో భాగంగా ఎర్తింగ్, వైరింగ్, బ్రేకర్స్ పని తీరు, షార్ట్ సర్క్యూట్ ప్రొటెక్షన్స్, లైటింగ్ ఎరిస్టర్స్ ఎర్తింగ్, హెచ్‌టీ, ఎల్టీ ప్రొటక్షన్స్, ట్రాన్స్‌ఫార్మర్ ప్రైమరీ, సెకండరీ ప్రొటక్షన్స్‌ను పరిశీలించాల్సి ఉంది.
- ఐఎస్ఐ ప్రమాణాల మేరకు ఆయా సాంకేతిక పరికరాలను, కేబుళ్లు, స్విచ్ బోర్డులు వాడారా లేదో? పరిశీలించాలి. నిర్దేశిత ప్రమాణాల మేరకు అన్ని ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే ఆయా భవనాలు, పరిశ్రమలకు అనుమతులు జారీ చేయాల్సి ఉటుంది. అయితే సిబ్బంది కొరతతో థర్డ్‌పార్టీ సమర్పించిన నివేదికను గుడ్డిగా అనుసరిస్తున్నారు. క్షేత్రస్థాయి వరకు వెళ్లినా.. కారు దిగకుండానే ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు.

అడ్డుకుంటూ.. అడ్డగోలుగా సంపాదిస్తూ..

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ హైదరాబాద్ పరిధిలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలు ఉంటాయి. డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రూరల్ పరిధిలో మెదక్, ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ నిజామాబాద్ పరిధిలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు ఉన్నాయి.

- 2014 నుంచి కొత్త నియామకాలు లేకపోవడంతో 15కు పైగా ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 11 కేవీ కనెక్షన్లు 16,140 వరకు ఉండగా, 33 కేవీఏ కనెక్షన్లు 883 వరకు ఉన్నాయి. 132కేవీ కనెక్షన్లు 107 వరకు ఉన్నాయి. మెజార్టీ కనెక్షన్లు గ్రేటర్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్లలో భాగంగా ఒక్కో అధికారి రోజుకు సగటున 50 కనెక్షన్లను తనిఖీ చేయాల్సి వస్తోంది. వీటితో పాటు కొత్తవాటికి అనుమతులు జారీ చేయాలి. కొంత మంది అధికారులు ఒకే చోట ఏళ్లుగా పాతుకుపోయారు. సమాన కేడర్‌లో పని చేస్తున్న తోటి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి, పోస్టులు కట్టబెట్టే అవకాశం ఉన్నా.. తమకున్న ఆర్థిక పలుకుబడితో వాటికి అడ్డుపడుతున్నట్లు తెలిసింది. ఫలితంగా కొత్తవాళ్లకు అవకాశాలు లేకుండా పోతుండటంతో పాటు ఏళ్లుగా పాతుకుపోయిన వాళ్ల అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

లారీ, బస్సు ఢీ

- క్యాబిన్‌లో కూరుకుపోయిన బస్సు డ్రైవర్
- మరో ఆరుగురికి గాయాలు


డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు

కొత్తూరు: ముందు వెళ్తున్న లారీని ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు అందులోని ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధి జాతీయ రహదారి వినాయకస్టీల్ కూడలి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీపీఆర్ సంస్థకు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, కడప జిల్లా బద్వేల్ నుంచి హైదరాబాద్‌కు వస్తోంది. ఈ క్రమంలో వినాయకస్టీల్ కూడలి వద్ద.. ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ శ్రీనివాస్(38) క్యాబిన్‌లో ఇరుక్కుపోగా, బస్సులోని ప్రయాణికుల్లో నలుగురికి స్వల్ప గాయాలు, మరో ఇద్దరు రాజేంద్ర, బాలాజీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను శంషాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళీగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగిని మృతి

షాద్‌నగర్: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి చెందింది. ఈ సంఘటన పట్టణ సమీపంలోని బైపాస్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ మండలం దాస్‌రాంనాయక్ తండాకు చెందిన అరుణ(25), ప్రసన్నకుమార్ దంపతులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరిద్దరు కారులో బాలానగర్ నుంచి నగరానికి వస్తున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు బైపాస్ రోడ్డులోని బుచ్చిగూడ బ్రిడ్జి వద్దకు రాగానే.. ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అరుణ అక్కడికక్కడే మృతి చెందగా.. ఆమె భర్తకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వివరాలను తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ భద్రత.. నిపుణత!

- విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు శిక్షణ
- హెచ్‌సీయూ, ఓయూ, జేఎన్‌టీయూ వంటి వర్సిటీలలో ఆన్‌లైన్ కోర్సులు

సాక్షి, సిటీబ్యూరో: రోజురోజుకూ సైబర్ మోసాలు పెను సవాల్‌గా మారుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం, పోలీసులు సైబర్ మోసగాళ్ల పనిపడుతుంటే.. మరోవైపు రోజుకో రకం మోసాలతో వారికే సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నతనం నుంచే సైబర్ మోసాలు, నియంత్రణ, భద్రత, చట్టాలపై అవగాహన కల్పించుకోవడం అనివార్యం. దీంతో కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ వంటి పలు విశ్వ విద్యాలయాలు సైబర్ భద్రతపై ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాయి. విద్యార్థులు, మహిళలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నాయి. దీంతో సైబర్ భద్రతపై నైపుణ్యత సాధించుకుంటే.. సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కకుండా రక్షించుకోవచ్చు.

- ఈ రోజుల్లో సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వినియోగించని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వినియోగిస్తున్నప్పుడు సైబర్ నేరస్థులు పంపుతున్న లింకులు, ప్రమాదకర వైరస్‌ల బారి నుంచి కాపాడుకునేందుకు జేఎన్టీయూ హైదరాబాద్ సైబర్ భద్రతపై ప్రత్యేక కోర్సు ప్రవేశ పెట్టింది.
- ఇంజినీరింగ్ విద్యార్థులు, వృత్తినిపుణులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులకు నాలుగు వారాలపాటు ఆన్ లైన్‌లో శిక్షణ ఇస్తుంది.
- దైనందిన వ్యవహారాల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలలో కొత్త ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్లను ప్రవేశపెట్టకముందే.. ఆయా ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్లలోని లోపాలను గుర్తించి అవి వైరస్ దాడులను సైబర్ భద్రత తట్టుకునేలా కోర్సులో చేరిన వారికి నేర్పించనున్నారు.

దాడులను ముందే గుర్తిస్తే...

నిత్యావసర వస్తువుల నుంచి ఐపీఎల్ టికెట్ల వరకు ఆన్‌లైన్‌లోనే కొంటున్నాం. కోట్ల మంది వినియోగిస్తున్న యాప్‌లు, ఇతర అప్లికేషన్లు భద్రతపరంగా సురక్షితంగా ఉన్నా.. ఆన్‌లైన్‌లో ఏదైనా వస్తువు కొన్న వెంటనే.. భారీ బహుమతులు, రాయితీలంటూ సెల్‌ఫోన్‌కు, ఈ-మెయిల్స్‌కు మెసేజ్‌లు వస్తున్నాయి. వీటిని క్లిక్ చేస్తే సైబర్ నేరస్థుల బారిన పడినట్టే.

- ఈ ముప్పు ముందే గుర్తించి కొత్త అప్లికేషన్లు, ప్రోగ్రామ్‌లలో సైబర్ నేరస్థుల బారినపడే అవకాశాలు ఎక్కడున్నాయి? తదితర అంశాలను సైబర్ భద్రత కోర్సులో శిక్షణ పొందుతున్న వారికి నేర్పిస్తారు. ఓయూ, హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో పాటు సైబర్ భద్రతపై పరిశోధనలు నిర్వహించి నిపుణులతో ఆన్‌లైన్‌లో పాఠాలు చెబుతున్నారు.

ప్రత్యేక పరికరాలు...

సైబర్ భద్రత కోర్సులో ప్రధానంగా దాడులు, వైరస్‌ల తీవ్రతను గుర్తించడం, వాటి బారిన పడకుండా ఏఏ చర్యలు చేపట్టాలన్న అంశాల పైనే వృత్తి నిపుణులు శిక్షకులకు బోధిస్తున్నారు.

- నాలుగైదు ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్లను ప్రయోగాత్మకంగా పరిశీలించి వాటిలో వైరస్‌లు, సైబర్ దాడులకు అనుకూలమైనవేవైనా ఉన్నాయా? అని గుర్తించేందుకు సాఫ్ట్‌వేర్ పరికరాలు, పనిముట్లతో శిక్షణ ఇస్తున్నారు. సాంకేతిక పరిభాషలో ఎన్ మ్యాప్, వైర్ షార్క్, మెటాస్ప్లాయిట్, బర్ప్ సూట్ వంటి పనిముట్లను వినియోగిస్తున్నారు. న్యాయపరమైన, నైతిక అంశాలను పరిగణలోకి తీసుకుని వాటిని కూడా పరిశీలిస్తున్నారు.

ఎండుతున్న పంటలు

సాగు నీరందక గతేడాది మాదిరిగానే పంటలు ఎండిపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పొలాలు నెర్రలుబారి పొట్ట దశలో పంటలు చేతికందకుండా పోయాయి. దీంతో పెట్టుబడులు అందక నిండా మునిగామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సాగుకు నీరందక ఇబ్బందులు

- ఇంకుతున్న భూగర్భజలాలు.. ఎండిపోతున్న బోర్లు
- నెర్రెలు బారిన నేలలు
- పశుగ్రాసంగా మారుతున్న పంటలు
- ఆర్థికంగా నష్టపోతున్న అన్నదాత

మండుతున్న రైతన్న గుండెలు


మంచాల: తాళ్లపల్లిగూడలో పశువుల మేతకు మోపుకడుతున్న రైతు యాదగిరి రెడ్డి

ఒక బోరు బావి.. 12 ఎకరాలు

చేవెళ్ల: మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన రైతులు ముకుందారెడ్డి, గోపాల్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి అన్నదమ్ములు. వీరు ఒక బోరుబావి కింద 12 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఎండల తీవ్రత కారణంగా నీరందక పంటలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సైతం నీరు అందడం లేదు. నాలుగు ఎకరాలకు మించి నీరు అందటం లేదు. రాత్రిపగలు పంటలను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. కళ్ల ముందు పంటలు ఎండుతుంటే చూడలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సర్వే చేపట్టి రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.


ఎన్కేపల్లిలో ఎండిపోతున్న వరి పంటను చూపుతున్న రైతు ముకుందారెడ్డి


షాబాద్: కుమ్మరిగూడలో పశుగ్రాసం కోసం వరిపంట కోస్తున్న రైతు లింగం


షాబాద్: పోలారం తండాలో ఎండిపోయిన మేతజొన్న

పశుగ్రాసంగా వరిపైరు

షాబాద్: మండల పరిధిలోని కుమ్మరిగూడకు చెందిన రైతు లింగం తనకున్న అర ఎకరంతో పాటు మరో అర ఎకరం కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. సాగునీరు అందక పంట ఎండిపోయింది. గత్యంతరం లేక ఎండిన పంటను పాడి ఆవులకు మేతగా కోసి వేస్తున్నాడు. మండల పరిధిలోని గోపిగడ్డ, పోలారం, పోలారం తండా గ్రామాల్లో రైతులు సాగు చేసిన కాలీఫ్లవర్, పశుగ్రాసం కోసం వేసిన మేతజొన్న పంటలు ఎండిపోయాయి. భూగర్భ జలాలు లేక.. విద్యుత్ అంతరాయం కారణంగా పంటలకు నీరందక రైతు కన్నీరు మిగిలుతోంది.


షాబాద్: పోలారంలో ఎండిపోతున్న కాలీఫ్లవర్

కరెంటు కోతలు.. కన్నీటి రాతలు


ఎండిన వరిచేలో దిగాలుగా కూర్చున్న రైతు శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: యాసంగి పంటకు సాగునీరు కష్టాలు మొదలయ్యాయి. ఓ వైపు అడుగంటిన భూగర్భ జలాలు.. మరో వైపు విద్యుత్ కోతల కారణంగా పంటలు కాపాడుకునేందుకు రైతు చేయని ప్రయత్నం లేదు. బోర్లలో నీరు ఉండడం, సన్నాలకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ .500 బోనస్ ప్రకటించడంతో రైతులు వరిసాగుపై మక్కువ చూపారు. పంటసాగు ప్రారంభంలో వ్యవసాయ బోర్లలో నీరు బాగానే ఉండటంతో రైతులు పంటలు సాగుచేశారు. ప్రస్తుతం బోర్లలో నీటిమట్టం తగ్గి, సాగుచేసిన పంటలకు నీరు అందకపోవడంతో వరి ఎండిపోతోంది. బోర్లలో నీటిమట్టం తగ్గడంతో పాటు కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం కలుగుతుందని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో పలువురు రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి.

ఎకరానికి పైగా ఎండిపోయింది

మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. వ్యవసాయ బోరు మొదట్లో నీరు బాగానే పోసినప్పటికీ నీటిమట్టం తగ్గడంతో ఇటీవల నీరు అందడం లేదు. ఇప్పటికే ఎకరానికి పైగా పంట ఎండిపోయింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, చింతలపల్లి

వరి.. తడారి


చింతపట్లలో ట్యాంకర్‌లో నీళ్లు తెచ్చి పారిస్తున్న రైతు వెంకట్‌రెడ్డి

యాచారం: కాలం ఏదైనా ప్రకృతి వైపరీత్యాలకు రైతు బలి అవుతూనే ఉన్నాడు. చేసిన కష్టం.. పెట్టిన పెట్టుబడి వెరసి అప్పులు పెరగడంతో అన్నదాత అప్పులుపాలవడంతో ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి. మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన ఇటిక్యాల వెంకట్‌రెడ్డి తనకున్న నాలుగు బోరుబావుల కింద రూ.లక్ష ఖర్చు చేసి నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. ప్రస్తుతం వరి పంట గింజలు పట్టింది. ఈ దశలో ఉన్న నాలుగు బోరుబావుల్లో భూగర్భజలాలు అమాంతం పాతాళానికి పడిపోయాయి. వరి పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోతుండడం చూస్తూ ఆ రైతు గుండె తల్లడిల్లిపోయింది. దీంతో పంటను కాపాడుకునేందుకు నిత్యం నాలుగు ట్యాంకర్ల నీటితో వరి పొలానికి తడులిస్తున్నాడు. అయినప్పటికీ ఎండ తీవ్రతకు నీరు వెంటనే ఆవిరవుతున్నాయి. ఆశతో బోరుబావులను మరమ్మతులు చేస్తే, రెండు, మూడు పైపులు కిందకు దించితే నీళ్లు వచ్చే అవకాశం ఉందేమోనని అటుగా ప్రయత్నాలు చేస్తున్నాడు. సర్కార్ తన లాంటి రైతులను ఆదుకోవాలని ప్రాధేయపడుతున్నాడు.

కరువు కాటు

మంచాల: ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు దోడ యాదగిరి రెడ్డి. తాళ్లపల్లిగూడకు చెందిన ఆయన.. మూడున్నర ఎకరాల్లో వరి, అర ఎకరాలో టమాట సాగు చేశాడు. మండుతున్న ఎండలకు రెండు పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో చేసేదేమీ లేక ఎండిన పంటను కోసి పశువులకు మేతగా వేస్తున్నాడు. ప్రభుత్వం పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నాడు.


తాళ్లపల్లిగూడలో వరిపంటను కోసి పశువులకు మేతగా వేస్తున్న రైతు

గ్రూప్-1 ర్యాంకర్‌కు అభినందనలు


కృతికను అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్లు

మీర్‌పేట: గ్రూప్–1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు సాధించిన మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన సిద్దాల కృతికకు ఆదివారం పలువురు అభినందనలు తెలిపారు. మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్‌యాదవ్, దోమలపల్లి ధనలక్ష్మి, బీఆర్ఎస్ నాయకుడు రాజ్‌కుమార్‌లు కృతికకు మిఠాయి తినిపించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యువతి తల్లిదండ్రులు బీరప్ప, లావణ్య ఉన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కొందుర్గు: అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి ఉత్తరాసిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్ల కుమార్(28) ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం అప్పుచేసి, ఓ బస్సును కొనుగోలు చేశాడు. దాంతో పాటు మరిన్ని అప్పులు చేశాడు. కానీ అప్పులు తీర్చే మార్గం కానరాక పోవడంతో మనస్తాపం చెందిన కుమార్.. శనివారం రాత్రి 7 గంటలకు పొలం వద్దకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రాత్రి 12 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లిచూడగా.. చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు అవివాహితుడు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

ప్రమాదవశాత్తు హోటల్ దగ్ధం


దగ్ధమవుతున్న హోటల్

ఆమనగల్లు: ప్రమాదవశాత్తు ఓ హోటల్ దగ్ధమైంది. ఈ సంఘటన ఆమనగల్లు పట్టణ సమీపంలోని విఠాయిపల్లి వద్ద హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చైత్ర మెస్ హోటల్ ఆదివారం యథావిధిగా ఉదయం వేళలో కొనసాగింది. మధ్యాహ్నం నిర్వాహకుడు శ్రీను హోటల్‌ను మూసివేసి వెళ్లిపోయాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన పలువురు పోలీసులకు, యజమానికి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. కల్వకుర్తి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను ఆర్పారు. అప్పటికే ఫర్నిచర్, ఫ్రిడ్జ్ తదితర సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద స్థలాన్ని ఆమనగల్లు ఎస్‌ఐ సీతారామ్‌రెడ్డి పరిశీలించి, వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

షాద్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శరత్‌కుమార్ కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన నరేష్(25) డ్రైవర్ పనిచేస్తూ కుటుంబ సభ్యులతో గ్రామంలో నివాసం ఉంటున్నాడు. నరేష్ ద్విచక్రవాహనంపై షాద్‌నగర్‌వైపు వస్తుండగా.. మార్గమధ్యలో హైవే ప్రక్కన అన్నారం గేట్ సమీపంలో మరో వాహనదారుడు బైక్‌ను రోడ్డు ప్రక్కన నిలిపి మూత్ర విసర్జనకు వెళ్లాడు. వెనుక నుంచి వచ్చిన నరేష్.. నిలిపి ఉన్న బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరేష్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం కుటుంబ సభ్యులు నగరానికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. మృతుడి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

ఉప్పల్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో రోడ్డు దాటుతున్న ఓ మహిళ తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందింది. ఉప్పల్ పోలీసుల సమాచారం మేరకు.. శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో స్టోర్ కీపర్‌గా పని చేస్తున్న మాగంటి స్వరూపారాణి(58) తన భర్త సురేందర్‌తో కలిసి బోడుప్పల్‌లో ఉంటున్నారు. వీరిది ధర్మాసాగర్ మండలం తాటికాయల గ్రామం. శనివారం డ్యూటీకి వెళ్లి తిరిగి వస్తూ ఉప్పల్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో ముషీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన స్వరూపారాణి అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడుల పేరుతో మోసం

- మళ్లీ అరెస్టయిన ప్రముఖ వ్యాపారవేత్త తొనంగి కాంతిదత్

బంజారాహిల్స్: ప్రముఖ వ్యాపారవేత్త తొనంగి కాంత్‌దత్‌ను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. గతంలో ఒకసారి సంతకాల ఫోర్జరీ కేసులో అరెస్టయిన కాంతిదత్‌ను మరోసారి పెట్టుబడుల పేరుతో మోసం చేసిన కేసులో సీసీఎస్–ఈఓడబ్ల్యూ ఎస్‌ఐ అనిల్‌కుమార్ నేతృత్వంలో కాంత్‌దత్‌ను శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయనపై నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనేక కేసులు నమోదయ్యాయి. 2024 డిసెంబర్‌లో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాంతిదత్‌పై మొదటి కేసు నమోదైంది.

- ‘త్రితీయా ఫైన్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకురాలు తిప్పల శ్రీజ ఫిర్యాదుతో సంతకాలు ఫోర్జరీ చేసి కంపెనీ నుంచి ఆమెను బహిష్కరించాడనే ఆరోపణలపై ఆయనను అరెస్టు చేశారు. శ్రీజ కంపెనీలో సుమారు రూ. 2.5 కోట్లు పెట్టుబడి పెట్టగా, కొన్ని వారాల్లోనే కాంతిదత్ నకిలీ పత్రాలతో ఆమె స్థానంలో తన తల్లి తొనంగి శ్రీదేవిని నియమించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- ఈ వ్యవహారం తర్వాత 2025 ఫిబ్రవరిలో నగరానికి చెందిన జూపల్లి సౌజన్య అనే మహిళ ఫిర్యాదు మేరకు సీసీఎస్‌లో మరో కేసు నమోదైంది. తప్పుడు హామీలతో ఆమె నుంచి రూ. 4.3 కోట్లు నుంచి రూ. 4.5 కోట్లు తీసుకుని వ్యాపార విస్తరణ పేరుతో మోసం చేశాడని ఆరోపించారు.
- ‘శ్రీ సమీర హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీ’ పేరుతో వ్యాపారం నడిపినట్టు చెప్పి పెట్టుబడిదారులను మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. 2019 నుంచి కాంతిదత్‌పై ఆర్థిక మోసాలకు సంబంధించి అనేక ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. ‘సస్టైన్ కార్ట్ మార్కెట్ ప్లేస్’ అనే కంపెనీని డిజైనర్ శిల్పారెడ్డితో కలిసి స్థాపించి, ప్రముఖ నటీమణులు కీర్తి సురేష్, కాజల్ అగర్వాల్, దేదస్రి సడెండ్ల వంటి సెలబ్రిటీల ద్వారా పెట్టుబడులను సేకరించాడు.
- అయితే 2023లో సంస్థ మూసివేయడంతో నిధుల మళ్లింపు ఆరోపణలు ఎదురయ్యాయి. తాజాగా అరెస్టయిన కాంతిదత్‌ను న్యాయపరమైన విచారణ కోసం రిమాండ్‌కు తరలించారు. పెట్టుబడులు పెట్టే ముందు పూర్తి పరిశీలన చేయాలని, కాంతిదత్ సంబంధిత మోసాలకు గురైన వారు సీసీఎస్‌ను సంప్రదించవచ్చని పోలీసులు తెలిపారు.